క్లుప్తంగా

ఎన్నికల వాయిదా

గరుగుబిల్లి: మండలంలో ఈ నెల 8వ తేదీన జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్లు మండల ఇరిగేషన్ ఏఈ ఎ.ప్రవీన్ సాగర్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మండలానికి సంబంధించి, 13 సాగునీటి చెరువులతో పాటు తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలో ఉన్న కుడి, ఎడమ కాలువలకు సంబంధించి, ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మళ్లీ ప్రకటన చేసినానంతరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు.

అమర గాయకుడు ఘంటసాల



ఘంటసాల గాత్ర విశిష్టతను వివరిస్తున్న మండల కళాకారులు

పాలకొండ రూరల్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు వరుసగా రెండు రోజుల పాటు కోటదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో పద్య, నాటక, పౌరాణిక రంగాలకు చెందిన కళాకారులు, గాయకులు, రచయితలు ఈ వేదిక ద్వారా వీక్షకులను, శ్రోతలను తమ విభిన్న ప్రతిభలతో ఆకట్టుకున్నారు. మండల తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఘంటసాలకు భారతరత్న అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వీవీ సూర్యనారాయణ, అర్చకులు లక్ష్మీప్రసాద్‌శర్మ, కార్యక్రమ నిర్వాహకులు కె.సూరన్నాయుడు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ



పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ మధుసూదనరావు

భామిని: రైతులకు విక్రయించే పురుగు మందులు, విత్తనాలు నాణ్యమైనవిగా ఉండాలని వ్యవసాయ శాఖ సాలూరు ఏడీ మధుసూదనరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు సింగిడి, బత్తిలి గ్రామాల్లోని పురుగు మందుల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న మందులకు సంబంధించిన రికార్డులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, క్రయ విక్రయాలకు సంబంధించి రసీదులపై ఆరా తీశారు.

వసతి సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణతో పాటు వసతి సదుపాయం కూడా కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఇస్తున్న శిక్షణలో వసతి సౌకర్యం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో కోచింగ్ అభ్యర్థులకు ఉపయోగపడడం లేదన్నారు. మూడు పూటలా భోజనం, వసతి, శిక్షణ కల్పించాలని కోరారు. ఇప్పుడు ఒక్క ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్‌ల అభ్యర్థులకు కూడా ఈ తరహా ఉచిత కోచింగ్ ఇవ్వాలన్నారు.

షెడ్యూల్ ప్రకారమే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులపై చర్చిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: రెవెన్యూ సదస్సులు అనుకున్న షెడ్యూల్ ప్రకారం పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. రెవెన్యూ సిబ్బందితో ఆయన గురువారం సదస్సుల నిర్వహణకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 8 వరకు జరగనున్న సదస్సులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలన్నారు సమావేశంలో ఆర్ఐ లక్ష్మునాయుడు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు స్వామివారిని చందనంతో ప్రత్యేకంగా అలంకరిచారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యా సమస్యలు పరిష్కారమయ్యేనా...!

- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలు లేక విద్యార్థుల అవస్థలు
- గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె
- గాలిలో విద్యార్థుల చదువులు
- మన్యం నిండా సమస్యలే...
- నేడు సీతంపేట ఏజెన్సీలో మంత్రి సంధ్యారాణి పర్యటన

సీతంపేట:

ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. గిరిజనుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరునెలలైనా ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా సీతంపేట ఐటీడీఏకు వస్తున్నారు. శుక్రవారం ఐటీడీఏలో అధికారులతో వివిధ సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో మన్యంలో గిరిజన సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..



సీతంపేట ఐటీడీఏ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జ్వరంతో పాటు రకరకాల వ్యాధుల బారిన పడితే సిక్ రూంలో ఉండాల్సిందే. బాలికలు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలున్నాయి. వీటిలో 7 టీపీఎంయూ మండలాలున్నాయి. 61 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 8 గిరిజన గురుకులాలు, మరో 18 పోస్టు మెట్రిక్ వసతిగృహాలున్నాయి. వీటిలో సుమారు 15 వేల మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎంలు లేరు. అన్ని గిరిజన విద్యాసంస్థల్లో ఏఎన్ఎంలను నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గిరిజన సంఘాల నాయకులు కూడా ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంతవరకు ఏ ఒక్క హామీ అమలు కాలేదు. అలాగే కుక్, కమాటీలు లేరు. దీంతో విద్యార్థులకు వండి పెట్టడంలో కొన్ని సందర్భాల్లో ఆలస్యమౌతుంది. డిప్యూటీ వార్డెన్‌లే సొంతంగా నిధులు వెచ్చించి వంట మనుషులు, సహాయకులను నియమించుకునే పరిస్థితి ఉంది. నాల్గో తరగతి సిబ్బందిని కూడా నియమించడం లేదు.

గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ టీచర్ల మాటేమిటి?

గత 20 రోజులుగా గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ టీచర్లు సమ్మెబాట పట్టారు. విద్యార్థులు చదువులు లేకుండా ఉన్నారు. ఆయా గురుకుల పాఠశాలల్లో బోధకులు లేక వచ్చిన చదువు మరిచి పోయే ప్రమాదంలో ఉన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి సీఆర్‌టీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డీఎస్సీలో తమ పోస్టులు మినహాయించాలని కోరుతున్నారు. గిరిజన గురుకులాల చైర్మన్‌గా ఉన్న మంత్రి ఆ సమస్యను పరిష్కరించాల్సింది పోయి రోజుల తరబడి వేచిచూడడం విడ్డూరంగా ఉందని ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి పథకాలు పడకేసాయి. స్వచ్ఛమైన మంచినీరు గగనమౌతుంది. ఇంటింటి కుళాయిల కనెక్షన్ లేదు. కొన్ని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. మరమ్మతులకు మరి కొన్ని రహదారులు నోచుకోవడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



భూసార పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని పాలీష్‌కోట పంచాయతీ పరిధిలో ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమాన్ని వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, పలువురు రైతులు మాట్లాడుతూ భూ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. భూసారం తగ్గకుండా ఉండేందుకు ఏడాది కాలం ఏదో ఒక పంటను సాగు చేయడం మేలన్నారు రసాయనిక ఎరువుల వాడకం కారణంగా సూక్ష్మజీవులు, సాగుకు మేలు చేసే బ్యాక్టీరియాలు నశించిపోతున్నాయన్నారు. సాంప్రదాయ పద్ధతులపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది దాసునాయుడు, హరీష్, జగ్గయ్య, భాగ్యవతి, నాగేశ్వరరావు, బి.జెర్మియా, ఊయక రాజు, బి.సుంకు, సుక్కు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: నేల గొప్పతనం వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: జీవుల మనుగడకు నేలే ఆధారమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అన్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు టి.సత్యారావు ఆధ్వర్యంలో కళాశాలలో ప్రపంచ నేల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. నేల తనలోని సారమంతా సన్నగిల్లే వరకు మొక్కలను పెంచి, పోషించి భూమిపై ఉన్న జీవుల మనుగడకు పనికివస్తుందన్నారు. నేల సారవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, హరి, చిన్నారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ నేల దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రవంతి, అనంత విహారి, ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ ధృవల ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. జీవుల మనుగడకు నేల ఆవశ్యకతను ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా 'ఉపాధి' పనులు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఎంపీపీ ఉరిటి రామారావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.పైడితల్లి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఉపాధి పనుల్లో భాగంగా ఏటా చెరువు అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ ఏ చెరువు కూడా అభివృద్ధి అయిన దాఖలాలు కన్పించడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ దుకాణాలను డమ్మీ డీలర్లు ఎక్కువగా నిర్వహించడంతో సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందడం లేదని మరికొంతమంది సభ్యులు ఆరోపించారు. జలజీవన్ మిషన్‌లో నిధులు మంజూరైనప్పటికీ రావుపల్లి ఎస్సీ కాలనీలో కనీస అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఎంపీటీసీ యందవ సదానందం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు తెలిపారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందించడం జరుగుతోందని ఎంఈవో–2 కె.కొండలరావు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది కలిగించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యాన్ని సేకరించడం జరుగుతోందని ఏవో ఆర్.విజయభారతి వెల్లడించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ఏర్పాట్లు పరిశీలన



రెవెన్యూ సదస్సు ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ: రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. గ్రామ పరిధిలో శుక్రవారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సు కోసం చేస్తున్న ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సదస్సులు నిర్వహణపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ముందుగానే ప్రజలకు సమాచారం అందించాలని తెలిపారు. రెవెన్యూ సమస్యలు ఉంటే నేరుగా సభల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ బాలమురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

16 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (ఎలక్ట్రీషియన్) కోర్సు ఉచిత శిక్షణను ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శిక్షణానంతరం ధ్రువపత్రంతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 3 నెలల శిక్షణ కోసం సిద్ధం కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7981308986ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆ శాఖ జిల్లా మేనేజర్ షన్ముఖరాజు అన్నారు. సీతంపేట మండలంలోని దోనుబాయి గ్రామంలో బిడ్డిక గిల్లయ్య అనే రైతు ఏటీఎం మోడల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. దిబ్బగూడ, బూర్జగూడలో సమీకృత వ్యవసాయం చేస్తున్న రైతు పొలాలను చూశారు. దిబ్బగూడలో 25 సెంట్లలో బి.శ్రీను వేసిన మారిషస్ పైనాపిల్ పంటను చూసి పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ, నరేష్, ధర్మ, రమేష్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

ఎవరో వచ్చి.. ఏదో చేస్తారని ఎదురుచూడక...



సీతంపేట మండలంలోని ద్వారబందం గ్రామ గిరిజనులు, ఎగువద్వార బందం, నడిమి ద్వారబందం గ్రామస్తులు ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడక తమ గ్రామాలకు సంబంధించి మరమ్మతులను వారే చేసుకున్నారు. గ్రామాల ప్రజలంతా ఐక్యంగా ఒక్కటై శ్రమదానంతో తమ గ్రామ రహదారులను మరమ్మతులు చేపట్టారు. రహదారుల విషయమై ఇటు పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా శ్రమదానానికి పూనుకున్నారు. – సీతంపేట

మంచు మాటున దాగి ఉన్న ప్రమాదం



ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో చీకటి పడితే ప్రయాణం శీతాకాలంలో ప్రమాదకరంగా మారింది. సాయంత్రం 5 గంటలకే మంచు విస్తారంగా కురుస్తూ రహదారిని కమ్మేస్తోంది. అలాగే ఉదయం 7 గంటల వరకు మంచు దుప్పట్లు వీడడం లేదు. ముఖ్యంగా పాలకొండ – సీతంపేట రహదారిలో మంచు దుప్పటి పరుచుకుంటోంది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం పొంచి ఉన్నట్టే... – పాలకొండ రూరల్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గరుగుబిల్లి: భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పి.బాల ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిలో, 7వ తేదీన రావుపల్లి, గొట్టివలస, 9న గిజబ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 11న తోటపల్లి, 12న ఆర్తీవలస, 13న నాగూరు, 16న చిలకాం, 17న వల్లరగుడబ, 18న దళాయివలస పంచాయతీలోని శివరాంపురం గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. 19న దళాయివలస, 20న ఉద్దవోలు, 21న పెద్దూరు పంచాయతీలోని శివరాంపురం, 23న గంగరాజుపురం, 24న మార్కొండపుట్టి, 26న లఖనాపురం, 27న సంతోషపురం, శివ్వాం పంచాయతీలోని సీతారాంపురం, 28న ఉల్లిభద్ర, మరుపెంట, 30న సీతారాంపురం, సొంబన్నవలస, 31న పెద్దూరు, జనవరి 2వ తేదీన శివ్వాం, చినగుడబ, జనవరి 3న కొంకడివరం, పోలినాయుడువలస, 4న కొత్తూరు, 6న సుంకి, 7న బీవీపురం, 8న హిక్కింవలస, గరుగుబిల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు చేపట్టనున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి, వినతిపత్రాలను ఈ సదస్సుల్లో తీసుకోవడం జరుగుతుందన్నారు.

దిగుబడుల నిర్ధారణకే పంటకోత ప్రయోగాలు



గుమ్మలక్ష్మీపురం: జేకే పాడు గ్రామంలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గరుగుబిల్లి: వరి పంట దిగుబడి నిర్ధారణకే పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి.అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని దత్తివలస గ్రామంలో రైతు కె.శంకరరావు పొలంలో నవధాన్యాలతో సాగు చేసిన శ్రీవరి, 1064 రకం పంటల దిగుబడులను పంటకోత ప్రయోగం చేసి, గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 5''5 చదరపు మీటర్లలో పంటకోత ప్రయోగం చేయగా, 19 కిలోల పంట దిగుబడి రావడం జరిగిందని, ఈ లెక్కన ఎకరాకు 35 బస్తాల దిగుబడి వస్తోందన్నారు. కార్యక్రమంలో వీఏఏ జగదీష్, వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



దత్తివలసలో పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ సాగు చేసిన పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని జేకే పాడు గ్రామంలో రైతు బిడ్డిక చామంతి పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరాకు 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణరావు, ఎంటీ నరసింహం, ఐసీఆర్‌పీలు దీప, పద్మ, నవ్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, కేదారిపురం ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.రవికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ వైర్లకు తాకే చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాలకొండ రూరల్: స్థానిక సబ్ స్టేషన్‌లో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిర్వహణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పట్టణ పరిధిలో ఇందిరానగర్ కాలనీ, వడమ కొత్త కాలనీ, వడమ, నగర పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో, గారమ్మకాలనీ, రాజాం రహదారి, గజాల ఖానా నుంచి తుమరాడ వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కొనసాగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశుగణన సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం: జాతీయ పశుగణన సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.మన్మథరావు అన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద సీతానగరం, బలిజిపేట, పశువైద్య సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 14,500 పశువుల పాకలు ఉన్నాయని, ఇప్పటివరకు 3859 సర్వే పూర్తయిందన్నారు. ఫిబ్రవరి 15లోగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. 550 పశువులకు బ్రూసేల్లస్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోశాలల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు మాట్లాడుతూ.. మొదట విడతగా 23 గోశాలలు మంజూరయ్యాయని, మరో 28 గోశాలలకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా పశుగ్రాస సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె.ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ దీదికుమార్, బలిజిపేట పశు వైద్యాధికారి జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పయనం



ఆపరేషన్లకు బయలుదేరి వెళ్తున్న వృద్ధులు

గుమ్మలక్ష్మీపురం: నేత్ర శస్త్రచికిత్స నిమిత్తం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీ నుంచి పలువురు విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి గురువారం పయనమయ్యారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో కెటరాక్ట్(అంతర కుసుమం), టెరీజియం (కొయ్యకండ) వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేయడంతో పాటు ఉచిత ప్రయాణం, వసతి, కళ్లజోడు, మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకురాలు సన్యాసమ్మ, ఆరోగ్య మిత్ర, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నాయకులు మండంగి శ్రీనివాసరావు, సీతారాం, రాజులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కురుపాం తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. 15 రోజులుగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులను పంపించాలని కోరారు. అలాగే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలన్నారు. అనంతరం తహసీల్దారు ఎం.రవణమ్మకు వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్‌లో పాము హల్‌చల్

పార్వతీపురం: జిల్లా కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద గురువారం సాయంత్రం ఓ పాము హల్‌చల్ చేసింది. జనసంచారం లేని సమయంలో కార్యాలయం మెట్ల వద్దకు వచ్చింది. మనుషుల అలికిడిని గుర్తించి సమీపంలోని పూల మొక్కల్లోకి వెళ్లింది. అక్కడ ఉన్న వారు దాన్ని బయటకు పంపించేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.